# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

| సంచిక : 313 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | గురువారం | 26 -12 -2024 | వెల : .రూ. 5.00 |
|---|---|---|---|---|---|



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో **(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
& **చైతన్య గళం** ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.






# మెదక్ చర్చితో గొప్ప అనుబంధం

- ఆ స్ఫూర్తితోనే ఉపాధి హామీ చట్టం అమలు
- ఇందిరమ్మ ఇండ్లు దళిత, గిరిజన క్రిస్టియన్లకు అత్యధికం
- పీసీసీ ప్రెసిడెంట్‌గా వచ్చినప్పుడే చెప్పా సీఎం హెూదాలో వస్తానని
- రూ.750 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఏడుపాయలలో ప్రత్యేక పూజలు..మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు



**25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్) మెదక్**
వందేండ్ల క్రితం ప్రఖ్యాత మందిరాన్ని నిర్మించడంలో భాగస్వామ్యమైన ప్రజలకు భోజనం పెట్టిన మెదక్ చర్చి దేశంలోనే గొప్పదిగా కీర్తించబడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఉపాధి హామీ చట్టాన్ని అమలులోకి తీసుకు వచ్చిందని అన్నారు. బుధవారం ఆయన -మిగతా 2 లో



# సినీ పరిశ్రమ ఏపీకి వెళ్లాలని కాంగ్రెస్ కోరుకుంటున్నది

- రాహుల్ పంచతీర్థాలు తిరగాలి
- కిషన్ రెడ్డి జాతీయ అధ్యక్షుడయితే సంతోషమే
- కేంద్ర హౌంశాఖ సహాయ మంత్రి బండి సంజరు

**25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)-హైదరాబాద్**
తెలంగాణ నుంచి తెలుగు సినీ పరిశ్రమ ఏపీకి వెళ్లిపోవాలని కాంగ్రెస్ కోరుకుంటున్నదని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజరుకుమార్ విమర్శించారు. అంబేద్కర్‌కు కాంగ్రెస్ చేసిన పాపాలు పోవాలంటే రాహుల్‌గాంధీ పంచతీర్థాలు తిరగాలని సూచించారు -మిగతా 2 లో



# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు?

- ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో
- దాన కిషోర్ వాంగ్మూలం రికార్డు
- దీని ఆధారంగానే కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు?

**25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)-హైదరాబాద్**
రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసుకు సంబంధించి రాష్ట్ర మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నమోదు చేశారు. గతంలో ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణకు సంబంధించి హెచ్ఎండీఏకు చెందిన ఐఓబీ ఖాతా నుంచి రూ.54.88 -మిగతా 2 లో

# కజకిస్థాన్‌లో కుప్పకూలిన విమానం



- 38 మంది మృతి
- పక్షి ఢీకొనటం వల్లే ప్రమాదమా..?

**బాకు25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కజకిస్థాన్ లో ఘోర ప్రమాదం జరిగింది. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ ప్రయాణికుల విమానం అక్టౌ సమీపంలో కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో 38 మంది చనిపోయినట్టు అధికారవర్గాలు తెలిపాయి. ప్రమాద సమయంలో విమానంలో 67 మంది ప్రయాణికులు, -మిగతా 2 లో

# శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల పరిహారం

**అల్లు అర్జున్ రూ. కోటి, దర్శకుడు రూ.50 లక్షలు నిర్మాతలు మరో ,రూ.50 లక్షలు**

- ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజుకు చెక్కులు అందజేసిన అల్లు అరవింద్
- నేడు సీఎంతో సినీ ప్రముఖుల భేటీ
- కిమ్స్ ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం పై వివరణ




**25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)-హైదరాబాద్**
ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద డిసెంబర్ 4న రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ కు గాయాలవగా.. ప్రస్తుతం శ్రీతేజ్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాత అల్లు అరవింద్ తో కలిసి కిమ్స్ ఆస్పత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించారు. కుటుంబసభ్యులు, డాక్టర్లతో మాట్లాడి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవతి కుటుంబానికి పుష్ప టీం రూ.2 కోట్లు పరిహారం ప్రకటించింది. అల్లు అర్జున్ రూ.కోటి, సుకుమార్ రూ.50 లక్షలు, మైత్రీ మూవీ మేకర్స్ రూ.50 లక్షలు ప్రకటించగా.. పరిహారం చెక్కులను అల్లు అరవింద్ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు అందజేశారు. -మిగతా 2 లో




# ఆ పథకాల్లేవు

- ఆప్ ప్రకటించిన రెండు పథకాలపై రెండు ప్రభుత్వ విభాగాల పబ్లిక్ నోటీసులు
- పౌరులు అప్రమత్తంగా ఉండాలంటూ పత్రికా ప్రకటనలు
-బీజేపీ ఒత్తిడితోనే ఇదంతా.. : ఆప్
-ప్రజలను మోసం చేస్తున్న ఆప్ : బీజేపీ

**న్యూఢిల్లీ:**
ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నా కొద్దీ.. రాజకీయం మరింత వేడెక్కుతున్నది. ఇక్కడ అధికార ఆప్ ప్రకటించిన రెండు పథకాలు ఇప్పుడు చర్చకు దారి తీస్తున్నాయి. ఆప్, బీజేపీల మధ్య మాటల యుద్ధానికి తెర లేపాయి. ఈ పథకాలేవి లేవనీ, ప్రభుత్వం వీటిని -మిగతా 2 లో



# ప్రత్యేక సాయం చేయండి

-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన
- ప్రధాని మోడీతో పాటు కేంద్ర మంత్రులతో భేటీ

**న్యూఢిల్లీ**
ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో ధన్యవాదాలతో సరిపెట్టుకున్నారు. బుధవారం ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, కుమార స్వామిలకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి మద్దతుగా నిలిచారని తెలిపారు-మిగతా 2 లో

# తెలంగాణలో రాబోయే రెండు రోజుల్లో మోస్తారు వర్షాలు..!

- బుధవారం హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షం కురిసింది.



**-హైదరాబాద్**
బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావం తెలంగాణపై కూడా చూపనుంది. దీంతో రానున్న రెండు రోజుల పాటు ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో బుధవారం హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షం కురిసింది. ములుగు, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, నల్లగొండ జిల్లాల్లో పలుచోట్ల చిరు జల్లులు కురిశాయి. నల్లగొండ జిల్లా మాటూరులో 1.1 సెం.మీ, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఇల్లందులో 1.1 సెం.మీ వర్షం కురిసింది. వాతావరణ శాఖ అంచనాలకు భిన్నంగా బంగాళాఖాతంలో -మిగతా 2 లో

# మెదక్ చర్చితో గొప్ప అనుబంధం

(మొదటి తరువాయి)



మెదక్ జిల్లాలో పర్యటించారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ్మా, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు సీఎంకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలను సమర్పించి సీఎం ప్రత్యేక పూజలు చేశారు. రూ.750 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిద అభివృద్ధి పనులకు ఆయన అక్కడే శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి మెదక్ చర్చి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడ చర్చి పాస్టర్లు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ వందేండ్ల చరిత్ర కలిగిన మెదక్ చర్చి దేశంలోనే గొప్ప దేవాలయంగా పరిఢవిల్లుతోందన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. చర్చి ఖ్యాతిని మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మెదక్ చర్చితో తనకు గొప్ప అనుబంధముందన్నారు. టీపీసీసీ ప్రెసిడెంట్ అయ్యాక ఇక్కడికి వచ్చానని%%% ఏడాదయ్యాక సీఎం హెూదాలో తిరిగి చర్చికి వస్తానని అప్పుడే భక్తులకు మాట ఇచ్చానని గుర్తు చేశారు. మెదక్ చర్చి వందేండ్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా ప్రభువు భక్తులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. పేదల ప్రభుత్వం ఉన్నప్పుడే ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంట్ వంటి పథకాలు అమలవుతాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో దళిత, గిరిజన క్రిస్టియన్లకు అత్యధికంగా ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని హామీ ఇచ్చారు. హెల్త్, ఎడ్యుకేషన్ రంగాల్లో క్రిస్టియన్ మిషనరీలు చేస్తున్న సేవల మాదిరే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదల కోసం సంక్షేమ పథకాల్ని అమలు చేస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సేవలందిస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 బోనస్, రూ.21 వేల కోట్ల రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. మెదక్ జిల్లా అభివృద్ధి విషయంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, ఇంచార్జి మంత్రి కొండా సురేఖ అండగా ఉంటూ అభివృద్ధికి పాటు పడతారని భరోసా ఇచ్చారు.

### రూ.750 కోట్లతో అభివృద్ధి పనులు

ఏడుపాయల దర్శనం సందర్భంగా రూ.750 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. మెదక్ ఇందిరా శక్తి భవన నిర్మాణానికి రూ.5 కోట్లు, ఏడుపాయలలో బీటీ రోడ్లు, డివైడర్లు, హైమాక్స్ లైట్ల ఏర్పాటుకు రూ.35 కోట్లు, గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.45.32 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణం కోసం రూ.7.44 కోట్లు, శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న మెదక్ చర్చి అభివృద్ధికి రూ.29.18 కోట్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం రూ.203 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లాల్లోని స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద రూ.100 కోట్ల చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీలు రఘు నందన్‌రావు, సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్‌రావు, సంజీవరెడ్డి, మదన్‌మోహన్ రావు, మదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, గ్రంథాలయ చైర్మెన్ సుహాసినిరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, మున్సిపల్ చైర్మెన్ చంద్రపాల్ పాల్గొన్నారు.

### సీఎం పర్యటనతో గేట్లకు తాళాలు..

సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ చర్చిలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలకు హాజరవుతున్న సందర్భంగా చర్చి గేట్లను మూసేసి తాళాలేశారు. రద్దీ ఎక్కువైతే బందోబస్తుకు ఇబ్బంది కలుగుతుందని పోలీసులు భక్తులు చర్చిలోపలికి వెళ్లకుండా నియంత్రించారు. దీంతో కొందరు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిస్మస్ పండగతో పాటు వందేండ్లు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా మెదక్ చర్చిని సందర్శించేందుకు భక్తులు అధికంగా వచ్చారు. సీఎం వచ్చిన సమయంలో గేట్లు మూసి నియంత్రించడంతో బయటే ఉండిపోయిన వాళ్లు పోలీసులపై మండిపడ్డారు.

# ఆ పథకాల్లేవు

(మొదటి తరువాయి)

నోటిఫై చేయలేదనీ, తప్పుదారి పట్టించే పథకాల పట్ల జాగ్రత వహించాలంటూ ప్రజలను హెచ్చరిస్తూ ఢిల్లీలోని రెండు ప్రభుత్వ విభాగాలు పత్రికల్లో పబ్లిక్ నోటీసు యాడ్స్ ద్వారా వివరించాయి. ఈ రెండు పథకాలు.. ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన. వీటి పైనే ఇప్పుడు ఢిల్లీలో చర్చ నడుస్తున్నది. అర్హులైన మహిళలకు నెలకు రూ.2100 అందించే పథకం మహిళా సమ్మాన్ యోజన. దీనికి సంబంధించి నమోదు ప్రక్రియను ఇటీవల ఆప్ అధినేత కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం అతిశీలు ప్రారంభించారు. ఇక, 60 ఏండ్లు పైబడినవారికి ఉచిత ఆరోగ్య సంరక్షణను కల్పించేది సంజీవని యోజన. అయితే, ఈ రెండు పథకాలూ అమలులో లేవనీ, ఈ స్కీమ్‌లకు సంబంధించి ఎవరికీ వ్యక్తిగత వివరాలు ఇవ్వకూడదని హెచ్చరిస్తూ ఢిల్లీ ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, మహిళా, శిశు అభివృద్ధి విభాగాలు పబ్లిక్ నోటీసులను ప్రచురించాయి. ఈ రెండు పథకాలను కేజ్రీవాల్ అధికారికంగా ప్రకటించారని ఆప్ అంటున్నది. ద్వేషాన్ని నింపుకొని ఉన్న బీజేపీ ఇప్పుడు మహిళలు, వృద్ధులనూ వ్యతిరేకిస్తున్నదని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజరుసింగ్ ఆరోపించారు. ఆ పార్టీ ఒత్తిడితోనే ప్రకటనలు వెలువడ్డాయనీ, అధికారులపై చర్యలుంటాయని వివరించారు. ఈ విషయంపై కేజ్రీవాల్ ఎక్స్ వేదికగా స్పందించారు. రెండు పథకాల ప్రకటనతో బీజేపీ విలవిలలాడుతున్నదని వివరించారు. "వారు ఒక కల్పిత కేసులో రానున్న రోజుల్లో అతిశీని అరెస్ట్ చేయాలని ప్లాన్ చేశారు. దానికి ముందు, సీనియర్ ఆప్ నేత ఇండ్లల్లో సోదాలు జరుగుతాయి" అని ట్వీట్‌లో ఆయన పేర్కొన్నారు. కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలను మోసం చేస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని బీజేపీ నాయకులు అన్నారు.

## తెలంగాణలో రాబోయే రెండు రోజుల్లో మోస్తారు వర్షాలు..!

(మొదటి తరువాయి)

అల్పపీడనం కదులుతోంది. ప్రస్తుతం దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు సమీపాన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ నైరుతిగా పయనించి దక్షిణ కోస్తా తీరం వైపు క్రమంలో బలహీనపడుతుందని అంచనాలు ఉన్నాయి. ఇక, తీవ్ర అల్పపీడనం కారణంతో బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వారం రోజులకు పైగా వదలకుండా, విడవకుండా ఉన్న ముసురు రైతులకు ముప్పుగా మారింది.

## ప్రత్యేక సాయం చేయండి

(మొదటి తరువాయి)

. ప్రధాని నివాసంలో ఆయనతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. 45 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, ఆర్థిక అంశాలు, సమస్యలు వంటి అంశాలపై చర్చించారు. పోలవరం, అమరావతి పనులు మళ్లీ ప్రారంభించిన విషయాన్ని ప్రధాని మోడికి వివరించారు. పనులు వేగంగా సాగేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఏపీకి కీలకమైన ఆ రెండు ప్రాజెక్టులు గాడిన పెట్టడానికి ఆర్థిక సాయం చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. 94 కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి గత ప్రభుత్వం నిధులు దారి మళ్లించిన విషయాన్ని, దానివల్ల జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో 74 పథకాలను తిరిగి ప్రారంభించామని అన్నారుఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశాన్ని ప్రధాని మోడీకి సీఎం చంద్రబాబు వివరించారు. ఆ ప్రాజెక్టుకు అవసరమైన ముడి ఖనిజం సరఫరా అయ్యేలా చేడాలని ప్రధానిని కోరారు.

## 'తప్పుడు కేసులో ఆతిశీని అరెస్ట్ చేయొచ్చు'

-సమాచారం అందిందని కేజ్రీవాల్ ఆరోపణ
-ఆప్‌ను పక్కదారి పట్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తూంది
-విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్




న్యూఢిల్లీ25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్) బీజేపీ ప్రోద్భలంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీని తప్పుడు కేసులోఅరెస్టు చేయవచ్చని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బుధవారం అనుమానం వ్యక్తం చేశారు. తప్పుడు కేసులో అతిశీని అరెస్టు చేయాలని దర్యాప్తు సంస్థలను బీజేపీ ఆదేశించినట్టు తమకు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందిందని విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రచారం చేయకుండా ఆప్‌ను పక్కదారి పట్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు. మరోవైపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నిక నేపథ్యంలో కేజ్రీవాల్ పోటీ చేస్తున్న నియోజకవర్గంలో మహిళలకు రూ.1100 చొప్పున బీజేపీ నగదును పంపిణీ చేస్తోందని ఢిల్లీ సీఎం, ఆప్ సీనియర్ నేత ఆతిశీ బుధవారం ఆరోపించారు.

# సినీ పరిశ్రమ ఏపీకి వెళ్లాలని కాంగ్రెస్ కోరుకుంటున్నది

(మొదటి తరువాయి)

. అవి ఎక్కడున్నాయో ఆయనకు తెలుసా అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్టీఆర్ ఘాట్ వద్ద కొత్తగా ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించాలని డిమాండ్ చేశారు.బీజేపీ రాష్ట్ర కార్యాలయం లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. అంబేద్కర్ విగ్రహం కేసీఆర్ ఏర్పాటు చేశారని అక్కడకు పోకపోవడం సరిగాద న్నారు. ఆ విగ్రహం ప్రజల డబ్బులతో పెట్టింది కాదా? అని ప్రశ్నించారు.అల్లు అర్జున్‌పై సీఎం స్థాయిలో అసెంబ్లీలో మాట్లాడిన అవసరం లేదన్నారు. దాని వెనుకున్న మత లబేంటో సీఎం బయటపెట్టాలని సంజరు డిమాండ్ చేశారు. సినీ పరిశ్రమ ఏపీకి వెళ్తే తెలంగాణకు నష్టం జరుగుతుందన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వస్తుందని ప్రచారం జరుగుతోందని మీడియా ప్రతి నిధులు అడిగిన ప్రశ్నపై స్పందిస్తూ..కిషన్ రెడ్డి జాతీయ అధ్యక్షులైతే సంతోషమేనని చెప్పారు.

# కజకిస్థాన్‌లో కుప్పకూలిన విమానం



(మొదటి తరువాయి)

ఐదుగురు సిబ్బందితో కలిపి మొత్తం 72 మంది ఉన్నారు. వీరిలో 29 మందిని ప్రాణాలతో బయటపడినట్టు కజకిస్థాన్ ఆరోగ్య శాఖ మంత్రి వెల్లడించారు. అజర్‌బైజాన్‌లోని బాకు నుంచి బయల్దేరిన ప్రయాణికుల విమానం రష్యా రిపబ్లిక్ చెచెన్యా రాజధాని గ్రోజ్నీ వైపు వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. గ్రోజ్నీలోని దట్టమైన మంచు కారణంగా దానిని దారి మళ్లించారు. ఈ క్రమంలోనే అక్టౌ ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తూ కూలిపోయింది. దాంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదానికి ముందు ఎయిర్‌పోర్ట్‌పైన విమానం పలుమార్లు గిరగిరా తిరిగి, నేల కూలిందని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ దృశ్యాలు నెట్టింట్లో వెలుగులోకి వచ్చాయి. అయితే ఈ ప్రమాదానికి పక్షి కారణమన్న కథనాలు వస్తున్నాయి.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు?

(మొదటి తరువాయి)

కోట్లను ఎఫ్ఈఓ విదేశీ కంపెనీకి బదిలీ చేశారంటూ ఇందులో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందని దాన కిషోర్.. ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఈనెల 19న గత ప్రభుత్వంలోని మునిసిపల్ వ్యవహారాల మంత్రి కేటీఆర్, అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్ అరవింద్‌కుమార్, హెచ్ఎండీఏ సీఈఓ బీఎల్ఎన్ రెడ్డిల పైన ఏసీబీ అధికారులు నాలుగు సెక్షన్ల కింద కేసులను నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే, కేటీఆర్‌ను ఈనెల 30 వరకు అరెస్టు చేయరాదంటూ ఈనెల 20న హైకోర్టు.. ఏసీబీకి ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో, దర్యాప్తును కొనసాగించటానికి గ్రీన్‌సిగల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో, తాజాగా దాన కిషోర్ నుంచి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. దాని ఆధారంగా ఈ కేసులో ప్రధాన ముద్దాయిగా పేర్కొనబడిన కేటీఆర్‌తో పాటు సీనియర్ ఐఏఎస్ అరవింద్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలకు ఒకట్రెండ్రోజులలో నోటీసులు జారీ చేసి వారిని విచారించటానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. మరోవైపు, ఈ కేసులో ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా కేటీఆర్‌పై పీఎంఎల్ఏతో పాటు ఫెమా ఉల్లంఘనల కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు.. తాము కూడా ఇందులో పేర్కొనబడిన నిందితులను విచారించటానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

# శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల పరిహారం

(మొదటి తరువాయి)




ఈ మేరకు అల్లు అరవింద్, దిల్ రాజు కలిసి శ్రీతేజ్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీతేజ్ కుటుంబానికి మా తరపున మొత్తం రూ.2 కోట్ల పరిహారం అందజేస్తున్నామని.. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని అల్లు అరవింద్ అన్నారు. శ్రీతేజ్ త్వరలోనే పూర్తిగా కోలుకుంటున్నామని ఆశిస్తున్నామన్నారు. అనంతరం దిల్ రాజు మాట్లాడుతూ..శ్రీతేజ్ త్వరగా కోలుకుంటున్నాడు. నిన్నటి నుంచి ఇప్పటివరకు రికవరీ వేగంగా ఉందన్నారు. శ్రీతేజ్ 72 గంటల నుంచి వెంటిలెటర్ లేకుండా ఉన్నాడు. పరిహారం సొమ్ము సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## తెలుగు పంచాంగం 26/12/2024, గురువారం

**సమయ సమాచారం:**
సూర్యోదయం: ఉదయం 6:48
సూర్యాస్తమయం: సాయంత్రం 5:45
**తిథి:**
ఏకాదశి: డిసెంబర్ 25 రాత్రి 10:29 నుండి డిసెంబర్ 27 తెల్లవారు జామున 12:44 వరకు
**నక్షత్రం:**
స్వాతి: డిసెంబర్ 25 మధ్యాహ్నం 3:22 నుండి డిసెంబర్ 26 సాయంత్రం 6:09 వరకు
విశాఖ: డిసెంబర్ 26 సాయంత్రం 6:09 నుండి డిసెంబర్ 27 రాత్రి 8:28 వరకు
**శుభ సమయాలు:**
అమృతకాలం: ఉదయం 8:20 నుండి 10:07 వరకు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 5:12 నుండి 6:00 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:54 నుండి 12:38 వరకు
**అశుభ సమయాలు:**
రాహు కాలం: మధ్యాహ్నం 1:39 నుండి 3:01 వరకు
యమగండం: ఉదయం 6:48 నుండి 8:10 వరకు
దుర్ముహూర్తం: ఉదయం 10:27 నుండి 11:11 వరకు, మధ్యాహ్నం 2:50 నుండి 3:34 వరకు
వర్జ్యం: రాత్రి 12:17 నుండి 2:02 వరకు

# రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలవండి

**వెల్దండ, డిసెంబరు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారతదేశ మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్‌పేయి శతజయంతి వేడుకల సందర్భంగా వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామంలో వివిధ యువజన సంఘాలు, బిజెపి నాయకులు, లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. లైన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, జోన్ చైర్మన్ సంపతి జనార్దన్ రెడ్డితో కలిసి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. "ఆరోగ్యవంతులైన యువతి యువకులు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలి. రక్తానికి ఎలాంటి కంపెనీలు ఫ్యాక్టరీలు ఉండవు, కేవలం ధాత్రుత్యము ద్వారానే లభిస్తుంది," అని ఆచారి పేర్కొన్నారు. "రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి," అని రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను పిలుపునిచ్చారు. ఈ




శిబిరంలో 40 మంది యువతీ, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు గ్రామీణ ప్రాంతాల్లో చేసే సేవా కార్యక్రమాలు పేద ప్రజలకు చాలా గొప్పగా ఉపయోగపడుతున్నాయని, ఈ సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 'భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి ఈవెంట్లు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నారు," అని డాక్టర్ సోలపోగుల స్వాములు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కండె హరిప్రసాద్, లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సంపతి జనార్దన్ రెడ్డి, క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, కోశాధికారి గుజ్జరి నరసింహ, జిల్లా చైర్మన్ జూలూరు రమేష్, ఓంకారము, బండెల రామచంద్రారెడ్డి, అంజిరెడ్డి, జూలూరు లింగయ్య, లైన్స్ క్లబ్ కార్యదర్శి దోనాదుల మహేష్, రవి రాథోడ్, శ్రీను, రక్తదాన శిబిర క్యాంప్ చైర్మన్ మట్ట మదన్ గౌడ్, మట్ట పరమేష్ గౌడ్, క్లబ్ పిఆర్వో పాషా, కురుమిద్ద యాదగిరి, యన్నం శేఖర్ రెడ్డి, జంగయ్య యాదవ్, విష్ణు గౌడ్, మట్ట శారదమ్మ, చక్రవర్తి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ సద్భావనకు చిహ్నం

-షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"
-నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే శంకర్
-కొత్తూరు మండలం రెడ్డిపాలెం, ఫాతిమాపూర్, షాద్ నగర్ పట్టణంలో వివిధ మందిరాల్లో ప్రార్థనలు

**షాద్ నగర్,25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానవజాతి కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా చేసుకునే క్రిస్మస్ పండగ సద్భావనకు చిహ్నం అని షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" అన్నారు. క్రిస్మస్ పండుగ వేడుకల సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండలంలో గల రెడ్డిపాలెం, ఫాతిమాపూర్ తదితర గ్రామాల్లో క్రైస్తవ సోదరులతో కలిసి ఆయా చర్చిల్లో క్రిస్మస్ ప్రార్థనలు చేశారు. అదేవిధంగా షాద్ నగర్ పట్టణంలోని వివిధ చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలకు ఎమ్మెల్యే శంకర్ తదితర ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకర్ ను పాస్టర్స్ ఆశీర్వదించారు. దేవుడి



యొక్క ఆశీస్సులు ప్రభుత్వానికి ఎమ్మెల్యే శంకర్ తదితరులకు ఎల్లవేళలా ఉంటాయని ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ క్రిస్మస్ ప్రాముఖ్యత గురించి వివరించారు. క్రిస్మస్ క్రైస్తవులకు ఎంతో పవిత్రమైన రోజనీ యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు ఈ పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. యేసుక్రీస్తు బోధనలు, ఆయన చూపిన ప్రేమ, మానవజాతి కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటారనీ, క్రిస్మస్ అనేది విశ్వాసం, సంతోషం, సద్భావనకు చిహ్నం అని వివరించారు. ఈ పండుగ ప్రజలను ఒక్కటి చేస్తుందనీ ప్రేమను, ఆశను పంచుతుందన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఒకచోట చేరి బహుమతులు పంచుకోవడం, పాటలు పాడటం, ప్రత్యేక విందులు చేసుకోవడం క్రిస్మస్‌లో ముఖ్యమైన భాగాలు తనకు ఎంతో ఇష్టమని శంకర్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీకి చెందిన పలువురు నాయకులు వివిధ విభాగాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు చౌరస్తాకు "అటల్ బిహారీ వాజ్‌పేయి" పేరు





**ఆమనగల్లు, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా ఆమనగల్లు మున్సిపాలిటీ చౌరస్తాకు ఆయన పేరును నామకరణం చేయడం ద్వారా చారిత్రాత్మక ఘట్టాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమం బిజెపి శాఖ ఆధ్వర్యంలో సుపరిపాలన దినోత్సవంగా ఘనంగా నిర్వహించబడింది. పార్టీ నేతల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టడంతో కార్యకర్తలు చౌరస్తాలో జమ అయ్యారు. అనంతరం అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలతో నివాళు లర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి చంద్ర శేఖర్, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, తెలంగాణ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి హాజరై, అటల్ స్ఫూర్తిదాయక జీవితాన్ని గురించి ప్రసంగించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు సుందూర్ శేఖర్, చెక్కల లక్ష్మణ్, గోరటి నర్సింహ, ఇతర ప్రముఖ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. "అటల్ బిహారీ వాజ్‌పేయి సుపరిపాలన సిద్ధాంతాలను ప్రజల్లోకి చొప్పించి, యువతకు ఆయన స్ఫూర్తిని చేరవేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం," అని నేతలు స్పష్టం చేశారు.

## క్రీస్తు బోధనలు ఆచరణీయం

-ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి
-ఫాతిమాపూర్ చర్చ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
-హాజరైన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,దేవేందర్ యాదవ్,ఎమ్మె సత్యనారాయణ

**షాద్ నగర్,25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
క్రీస్తు బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు.కొత్తూరు మున్సిపాలిటీ ఫాతిమాపూర్ చర్చిలో ఫాదర్ సైమన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దిలీప్ రెడ్డి ఇంట్లో టిఫిన్స్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ..క్రీస్తు బోధనలు ఆచరణీయమని అహింసా విధానం సమాజంలో శాంతి సామరస్యాలకు ప్రతీక అని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు అనునిత్యం అనుసరించదగిన మార్గదర్శకాలని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ యువ కార్యకర్త బద్దుల యాదయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

-ఎల్లికట్ట బిఆర్ఎస్ కార్యకర్తల సమిష్టి ఆర్థిక సహాయం లక్ష రూపాయలు
-ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చేతుల మీదుగా అందచేత



**ఫరూక్ నగర్,25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఫరూక్ నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ కార్యకర్త బద్దుల యాదయ్య కుటుంబానికి బీఆర్ఎస్ కార్యకర్తలు అందరూ సమిష్టిగా లక్ష రూపాయలు పోగు చేసి మృతి చెందిన బుద్ధుల యాదయ్య కుటుంబానికి అండగా నిలబడాలనే ఉద్దేశంతో లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చేతుల మీదుగా మృతుని కుటుంబానికి అందించారు. చెక్కును అందజేసిన వారిలో బెంది శ్రీనివాస్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయి యాదవ్,మాజీ సర్పంచ్ యాదయ్య, కంటెస్టెడ్ యంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబెర్స్, బిఆర్ఎస్ గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డైమండ్ బావర్చి రెస్టారెంటును ప్రారంభించిన ఎమ్మెల్యే



**షాద్ నగర్, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టుదలతో యువత అనుకున్న లక్ష్యాలను సాధించుకోవాలని, స్వయంకృషితో ఎదగాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణం పరిగి రోడ్ లో శివకు సంబంధించిన డైమండ్ బావర్చి రెస్టారెంట్ ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లాంఛనంగా ప్రారంభించారు. రెస్టారెంట్ యజమాని శివకు శుభాభినందనలు తెలుపుతూ, "సమాజంలో గౌరవప్రదంగా కష్టపడి పనిచేస్తూ పదిమందికి పట్టడం పెడుతూ నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్న శివను అభినందిస్తున్నాను," అన్నారు. "దినదిన ప్రవర్తమానంగా వ్యాపారంలో ఎదుగుతూ మరో బ్రాంచ్ ను కొత్తగా ప్రారంభించడం శుభసంకేతం," అని శంకర్ కొనియాడారు. "ప్రజలకు నాణ్యమైన భోజనాలను అందించాలని, ఆరోగ్యమే మహాభాగ్యం కాబట్టి ప్రతి మనిషి ఎంత కష్టపడ్డ బుక్కెడు తిండి కోసం ఉంటారు. అందుకే మంచి భోజనాలను అందించాలని, ప్రజలకు అందుబాటులో సరసమైన ధరలకు ఇవ్వాలని," సూచించారు.

# శత జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ రాములు

**వంగూరు, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూరు మండల రంగాపూర్ గ్రామంలో భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ పోతుగంటి రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ, "మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఆయనను ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు



ప్రజలకు గుర్తుండే విధంగా అమలు చేశారు," అని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్లమెంటరీ కన్వీనర్ రాగి రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు నాగయ్య గౌడ్, అల్లే భీమయ్య, గున్న ఆనంద్ రెడ్డి, బూదరు సాయన్న, జగన్మోహన్ రెడ్డి, శీను, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం



**పదరా,డిసెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

మానవత్వం చాటుకున్న శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ సంఘంఅధ్యక్షుడు నారోజు కుమారస్వామి చారి ... నాగర్ కర్నూల్ జిల్లా పదరా మండలం ఓంకేశ్వరం గ్రామానికి చెందిన ఉప్పునుంతల వెంకటేశ్వర్లు ఆరోగ్యపరిస్థితి క్షీణించడంతో, కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా ఆయన రెండు కిడ్నీలు పాడయ్యాయని డాక్టర్లు తెలిపారు. ఆయనకు భార్య, ఒక కూతురు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సమాచారం శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి బండి కట్ల వెంకటేశ్ చారి దృష్టికి రావడంతో వెంటనే ఆయన సంఘం అధ్యక్షుడు నారోజు కుమారస్వామి చారి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే సంఘం యొక్క సభ్యుల సహకారంతో ఉప్పునుంతల వెంకటేశ్వర్లు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించి, మంగళవారం సంఘం కార్యాలయంలో ఆర్థిక సహాయం నగదు రూపంలో అందించారు మరియు వారికి నిత్యావసర సరుకులు కూడా అందిస్తామని హామీ ఇచ్చారు, అలాగే ఇతర దాతల సహాయంతో వారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన ప్రకటించారు. అలాగే మాజీ ఎంఎల్ఏ, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచన్నగారి లక్ష్మారెడ్డిని మరియు శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూధన చారిని కలిసి ప్రభుత్వం ద్వారా సహాయం అందించేందుకు ప్రయత్నిస్తామని నారోజు కుమారస్వామి చారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నారోజు కుమారస్వామి చారి, ప్రధాన కార్యదర్శి బండికట్ల వెంకట చారి, కోశాధికారి బండోజు రవి చారి, సంఘం సభ్యులు దత్తశ్రీ భారత్, కమ్మరి లింగమ చారి, వారణాసి గురు వీరబ్రహ్మం, శ్రీమన్నారాయణ చారి, బండోజు స్వామి చారి, కలకొండ శ్రీనివాస్ చారి, నారొజు బ్రహ్మాచారి, ఎస్.సురేందర్, పంజుల వెంకటేశ్ గౌడ్, కురెళ్ళ శేఖర్ చారి, ఆదిమూలం రాజు చారి, ఎం. చంద్రశేఖర్ చారి, కే. రమేష్ చారి, బొడ్డుపల్లి వీరాచారి, అశోక్ చారి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీతేజ్ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటాం

-సినీ నిర్మాత దిల్ రాజు



**హైదరాబాద్, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

శ్రీతేజ్ వెంటిలేటర్, ఆక్సిజన్ లేకుండా 72 గంటలుగా శ్వాస తీసుకోగలుగుతున్నాడు. అతని కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని, శ్రీతేజ్ తండ్రికి సినీ ఇండస్ట్రీలో పర్మినెంట్ ఉద్యోగం ఇస్తామని, దిల్ రాజు తెలిపారు. 'అల్లు అర్జున్, నిర్మాతలు, డైరెక్టర్ కలిసి 2 కోట్ల రూపాయలు అందజేస్తామని," ఆయన చెప్పారు. "రేపు సీఎం రేవంత్‌రెడ్డిని సినీ పెద్దలతో కలవబోతున్నాం. హీరోలు, దర్శకులు, నిర్మాతలు రేపు ఉదయం 10 గంటలకు సీఎంను కలవబోతున్నారు," అని అన్నారు. "సినిమా ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటా," అని దిల్ రాజు పేర్కొన్నారు.

# కరుణామయుడు ఏసు ప్రభువు



**కద్దాల్, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రజల కోసం ఎన్నో కష్టనష్టాలను అనుభవించి, జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు, కరుణామయుడు యేసుక్రీస్తు అని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా మరియు కద్దాల్ మాజీ జెడ్పీటిసి, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జరుపుల దశరత్ నాయక్ అన్నారు. మండలంలోని రావిచేడు గ్రామంలో ఉన్న చర్చ్ లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ క్యాలెండర్ ను గంప వెంకటేష్ గుప్తా, దశరత్ ఆవిష్కరించి వారిని సన్మానించారు. ఒకరికి ఒకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రావిచేడు మాజీ సర్పంచ్ విఠలయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పాండు, బిజెపి నాయకులు బాలెందర్ నాయక్, చర్చి పాస్టర్ రాజేష్ మరియు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**వెల్దండ, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వెన్నెల మండలంలోని గుండాల గ్రామంలో క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని ఎంపీ బెత్లహేము చర్చిలో సంఘ కాపరి పాస్టర్ జోసెఫ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు జననం గురించి బైబిల్ లోని వాక్యం సారాంశము బోధించడం జరిగింది. పశ్చిమ దేశాల్లో క్రైస్తవులు డిసెంబరు 25న క్రిస్మస్ ను ఆనవాయితీగా జరుపుకుంటారని పాస్టర్ జోసెఫ్ వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు శాంసన్, పీటర్, మున్నా, దావీదు, యాదగిరి, రవికుమార్, ప్రసాద్, డేవిడ్, పవిత్ర కుమార్, ప్రభు, కిరణ్, బాలకృష్ణ, మీనా తదితరులు పాల్గొన్నారు.

# వెల్దండ మండలంలో రైతు ఆత్మహత్య, ఎమ్మెల్యే నారాయణరెడ్డి పరామర్శ



**వెల్దండ, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వెల్దండ మండల పరిధిలోని తిమినోని పల్లి గ్రామపంచాయతీలో రాచూరు తండాకు చెందిన మూడవత రవి నాయక్ (45) మంగళవారం తన వ్యవసాయ పొలంలో ఉరి వేసుకుని చనిపోయారు. రవి మరణ వార్త తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రవి నాయక్ కుటుంబాన్ని పరామర్శించి మృతి దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, వెల్దండ సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వావిలాల ఉమా మనీలా, పర్వత్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ఎండి రషీద్, కొయ్యల పుల్లయ్య, క్రిస్టల్ తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వెల్దండ సింగల్ విండో చైర్మన్



**కల్వకుర్తి, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కల్వకుర్తి పట్టణ పరిధిలోని సి.బి.ఎం కాలేజీలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా వెల్దండ సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "హ్యాపీ క్రిస్మస్ పండుగ ముఖ్య ఉద్దేశం పశ్చిమ దేశంలోని క్రైస్తవులంతా డిసెంబరు 25న క్రిస్మస్ ను ఆనవాయితీగా జరుపుకుంటారు. ఏసుక్రీస్తు జన్మించిన రోజున గనుక ఘనంగా జరుపుకోవడం జరుగుతుంది," అని అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, "సుఖశాంతులతో కలిసిమెలిసి ఉండాలి," అని భాస్కరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎండి సిరాజ్, బుర్ర వెంకటయ్య, జగపతి, ఎర్రవెల్లి శీను తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మట్ట వెంకయ్య గౌడ్



**వెల్దండ, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని వెల్దండ మండల పట్టణంలోని ప్రజలకు హ్యాపీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన వెల్దండ సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకయ్య గౌడ్. ఈ సందర్భంగా మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, "క్రైస్తవుల ప్రకారము దేవుని కుమారుడైన ఏసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ గా నిర్వహిస్తారు. ప్రతి ఏటా డిసెంబర్ 25న ఈ పండుగ వస్తుంది. ఈ పవిత్రమైన దినము ప్రేమ, క్షమానుగుణము, కరుణ అతని బోధనలో గుర్తుచేస్తుంది," అని వివరించారు. 'క్రిస్మస్ రోజు కరోల్స్ పాటలు పాడడం నుండి క్రిస్మస్ చెట్టును అలంకరించడం వరకు అనేక కార్యక్రమాలు జరుపుకుంటారు. మండల ప్రజలందరికీ సుఖశాంతులతో సోదర భావంతో మరిన్ని పండుగలు ఘనంగా జరుపుకోవాలి," అని మట్ట వెంకటయ్య గౌడ్ తెలిపారు.

# శబరిమల భక్తుల కోసం 'స్వామి' చాట్బాట్



**కేరళ, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు దేవస్థానం బోర్డు నూతన సాంకేతికతను వినియోగిస్తోంది. తాజాగా భక్తులకు ఉపయోగపడే 'స్వామి' పేరుతో ఏఐ చాట్బాట్ ను అందుబాటులోకి తీసుకు వచ్చారు. వాట్సాప్ ఆధారిత చాట్బాట్ ద్వారా ఆలయానికి సంబంధించిన పూర్తి సమాచారం, దర్శన సమయాలు, వాతావరణ పరిస్థితులు, ఆహారలభ్యత, భక్తుల సమూహాలు వంటి అంశాలపై రియల్ టైమ్ అప్డేట్స్ ఇవ్వనున్నారు.

# కొందుర్గు మండల కేంద్రంలో నయారా పెట్రోల్ పంప్ ప్రారంభోత్సవం

-ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**కొందుర్గు,25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

: కొందుర్గు మండల కేంద్రంలో నయారా పెట్రోల్ పంపు ప్రారంభోత్సవం జరిగింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నయారా పెట్రోల్ పంపును ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, సింగల్ విండో చైర్మన్ దామోదర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మంజుల మల్లేష్ గౌడ్, సిమెంట్ రాములు గౌడ్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ నరేందర్, జాకారం శేఖరు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రో మరో కీలక ప్రయోగం



**శ్రీహరికోట, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో కీలక ప్రయోగం చేపట్టబోతోంది. ఈ నెల 30న రాత్రి 9.30 గంటలకు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని తొలి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సి60 రాకెట్‌ను నింగిలోకి పంపనుంది. ఈ రాకెట్ ద్వారా 400 కిలోల బరువుతో రూపొందించిన స్పాడెక్స్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జంట ఉపగ్రహాలను నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశపెట్టనుంది. ఈ ప్రయోగంతో ఇస్రో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థకు మరిన్ని అవకాశాలను తెరపడుతుంది. ఈ ప్రయోగం భారత అంతరిక్ష పరిశోధన రంగంలో మరిన్ని ముందడగులు వేస్తుంది.

# ప్రయాగలోని మహాకుంభ మేళాకు విశాఖ నుంచి ప్రత్యేక రైళ్లు



**విశాఖపట్నం, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జనవరి 13నుంచి ఫిబ్రవరి 26వరకు ప్రయాగ్ రాజ్ లో జరిగే మహాకుంభ మేళాకు విశాఖ నుంచి 9 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ఈస్ట్ కోస్టల్ రైల్వే వెల్లడించింది. విశాఖ-గోరఖ్పూర్ మధ్య జనవరి 5, 19, 16తేదీల్లో 08562 నంబర్ రైలు ప్రయాణిస్తుందని తెలిపింది. విశాఖ-దీన్ దయాళ్ స్టేషన్ల మధ్య 08530 నంబర్ రైలు జనవరి 9, 16, 23, ఫిబ్రవరి 6, 20, 26 తేదీల్లో నడుస్తుందని వివరించింది. క్రిస్మస్ శు భాకాంక్షలు తెలిపిన ఇండో-ఇజ్రాయిల్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్

# ధ్యాన సంద్రమైన కైలాసపురి పత్రీజీ శక్తిస్థల్





**కడ్తాల్, డిసెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ధ్యానంతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని, మానసిక ఒత్తిడి దూరమవు తుందని పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయ భాస్కర్ రెడ్డి, పరిమళ పత్రీజీ అన్నారు. బుధవారం పత్రీజీ ధ్యాన యాగం వేడుకల్లో భాగంగా 5వ రోజు ఉదయం 5 గంటల నుంచి 8 : 30, నిమిషాల వరకు సంగీత ధ్యానం, పత్రీజీ విడియో సందేశం, సంగీత వేణునాథ ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. పత్రీజీ ధ్యాన యాగం వేడుకలకు క్రిస్టమస్ పండుగ కావడంతో పిరమిడ్, పత్రీజీ శక్తిస్థల్ ప్రాంతం సందడి మారింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం మన ఇంటి నుండి మొదలవ్వాలి, చిన్నపిల్లలకు చిన్నప్పుడే ఆత్మ విద్య నేర్పాలని వారన్నారు రోజుకు ఒక గంట ధ్యానం చేసిన వ్యక్తి ఆరోగ్యంగా జీవించవచ్చని వారు పేర్కొన్నారు. ఆధ్యాత్మికత, విద్య తెలిసిన వారు జీవితాంతం సంతోషంగా ఉంటారని వారు ధ్యానం చేసే వారికి ఎటువంటి కష్టాలు, రోగాలు ధరి చేరవన్నారు. యోగా సాధన వల్ల ఎన్నో





ప్రయోజనాలు ఉన్నాయని వారు అన్నారు. అంతకు ముందు కార్యక్రమాల్లో భాగంగా సంగీతం, నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీరామ్ గోపాల్ హనుమంతరాజ్ రాంబాబు, దామోదర్, సాంబశివరావు, నిర్మలా దేవి, లక్ష్మి, మాధవి, బాలకృష్ణ, పిరమిడ్ మాస్టర్స్ స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# మానసిక ఆరోగ్యంపై 'సెల్‌ఫోన్' దెబ్బ

**హైదరాబాద్,25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)** అరచేతిలో ఇమిడే విజ్ఞాన సర్వస్వం 'స్మార్ట్ ఫోన్'. బాల్యాన్ని అథఃపాతాళానికి తొక్కుతున్నదీ ఇదే స్మార్ట్ ఫోన్. పదేళ్ల వయసులో స్మార్ట్ ఫోన్ ఎక్కువ ఉపయోగిస్తున్న బాలబాలికలు సగం మంది యుక్తవయసుకు వచ్చేసరికి వివిధ రకాల మానసిక రుగ్మతల బారినపడుతున్నారు. విద్యార్థుల ఏకాగ్రతను, చదువును, సంస్కారాన్ని, వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తోంది. బంగారు భవిష్యత్తును ఛిద్రం చేస్తున్న స్మార్ట్ ఫోన్ల ఉచ్చులో చిక్కుకోవడం సభ్య సమాజాన్ని కలచివేస్తోంది. పిల్లలకు డిజిటల్ పరిజ్ఞానం పెరుగుతుందని, ఆన్‌లైన్‌లో నేర్చుకుంటారని స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లెట్‌లను చేతికిస్తే%‌%% భవిష్యత్తులో మానసిక సమస్యల బారినపడటం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కరోనా అనంతరం పిల్లల అలవాట్లు, మానసిక ప్రవర్తనల్లో విపరీతమైన మార్పులు సంభవిస్తున్నాయి. పాఠశాలలు దీర్ఘకాలం మూతపడటంతో టివి, ట్యాబ్, ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, సామాజిక మాధ్యమాలు, సినిమాలు, సీరియల్స్, వెబ్ సిరీస్, ఆన్‌లైన్ గేమేషోలు వారికి వినోద సాధనాలు, కాలక్షేప వేదికలుగా మారాయి. కొంతమంది పిల్లలు వినోదం మాటున అశ్లీల, హింసాత్మక దృశ్యాలు చూడటం ద్వారా దారి తప్పుతున్నారు. వీటన్నింటి ప్రభావంతో బాలల్లో దూకుడు, అవాంఛనీయ నిర్ణయాలు, అసంకల్పిత ఆలోచనలు మితిమీరుతున్నాయి. ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన, చికాకు పెరిగిపోతున్నాయి. చిన్న విషయాలకే తీవ్రంగా స్పందిస్తున్నారు. విచక్షణ కోల్పోయి హింసాత్మక సంఘటనలకు పాల్పడుతున్నారు. పిల్లల్లో మానసిక సమస్యలు పెరిగి, నేరస్థులుగా మారుతున్నారు. కన్నతల్లిని హతమార్చడం, యువకుడిని ముగ్గురు పిల్లలు కలిసి చంపడం, ఓ బాలుడి ఆత్మహత్య, మతిస్థిమితం కోల్పోవడం, దొంగతనానికి పాల్పడటం వంటి సంఘటనల వెనుక ప్రధాన సూత్రధారి స్మార్ట్ ఫోన్. బాల్యంలోనే స్మార్ట్ ఫోన్‌ను అందుకున్నవారు, యుక్త వయసుకు వచ్చాక ఆత్మహత్య ఆలోచనలు పెరగడం, ఇతరుల పట్ల దూకుడుగా వ్యవహరించడం, వాస్తవికత నుంచి దూరంగా పలు రకాల భ్రాంతులకు గురికావడం వంటి సంఘటనలు ఏయేటి కాయేడు పెరుగతున్నట్లు అమెరికాకు చెందిన స్వచ్ఛంద సంస్థ సేపియన్ ల్యాబ్స్ నిర్వహించిన సర్వేలో వెల్లడించింది. మన దేశంతో సహా 40 దేశాల్లో నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు తేటతెల్లమయ్యాయి. ఊహ తెలియని ఆరేళ్ల వయసులోనే బాలికలు స్మార్ట్ ఫోన్‌ను వినియోగించడం ప్రారంభించిన 74% మంది తీవ్రమైన మానసిక ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఇక పదేళ్ల వయసులో మొదటి



స్మార్ట్ ఫోన్ అందుకున్నవారిలో 61% మంది, పదిహేనేళ్లకు వాడటం మొదటిపెట్టినవారిలో 52% మంది మానసిక దుష్ప్రభావాలకు లోనయినట్లు గుర్తించారు. ఇక బాలుర విషయానికొస్తే, ఈ ప్రభావం కాస్త తక్కువగా ఉన్నప్పటికీ, ఆరేళ్ల వయసులో స్మార్ట్ ఫోన్‌ను వాడటం మొదలుపెట్టిన వారిలో 42%, 18 ఏళ్లలో ఇది 36% ఉంది. స్మార్ట్‌ఫోన్ విప్లవానికి ముందు పిల్లలు చాలా సమయం కుటుంబంతో, స్నేహితులతో గడిపేవారు. ఇప్పుడీ పరిస్థితి లేదు.

సమాజంలో తమ భాగస్వామ్యానికి తగినట్లుగా సాధన లేకపోవడం, తోటివారితో కలవకపోవడంతో ప్రవర్తన తీరు సంక్లిష్టంగా మారుతోంది. డిజిటల్ ఉపకరణాలు, సామాజిక మాధ్యమాలు, సినిమాలు, గేమేషోలు, వెబ్ సిరీస్ తదితరాలకు బానిసలుగా మారుతుండటంతో పిల్లల్లో మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయి. వారు నేరస్థులుగా మారడానికి కారణమవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యయనాలు వెల్లడించాయి. 13 ఏళ్ల వయస్సు నుంచే పిల్లలు సొంతంగా సెల్ ఫోన్ కొనుక్కుంటున్నారని, 917 ఏళ్ల వయసు పిల్లల్లో 30% మేరకు సొంత ఫోన్లు ఉన్నాయని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సిపిసిఆర్) అధ్యయనం తేల్చింది. ఈ వయసు పిల్లల్లో 43% ఇన్‌స్టాగ్రామ్‌, 37%పైగా ఫేస్‌బుక్ ఖాతాలు కలిగి ఉన్నారని గుర్తించింది. 810 వయసు పిల్లలు సగటున రోజుకు ఎనిమిది గంటలు, కౌమర దశ చిన్నారులు 11 గంటల దాకా ఎలక్ట్రానిక్ తెరలతో గడుపుతున్నట్లు అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ తెలిపింది. టీనేజ్ పిల్లల్లో ఇదివరకు ఏడు నుంచి ఎనిమిది శాతం మధ్య ఉన్న మానసిక సమస్యలు కరోనా అనంతరం 15 శాతానికి పెరిగినట్లు బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ (నిమ్హాన్స్) పరిశీలనలో తేలింది. ఇందుకు భిన్నంగా పీయర్సన్స్ గ్లోబల్ లెర్నర్స్ సంస్థ చేపట్టిన సర్వే ఉంది. చిన్నారుల మానసిక ఆరోగ్యానికి సామాజిక మాధ్యమాలు, వీడియో గేమ్‌లు దోహదం చేస్తున్నాయని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. వీడియో గేమ్‌లతో మంచి జరుగుతుందని 40% మంది, సామాజిక మాధ్యమాలతో మానసికంగా ఎదుగుతారని 30% మంది తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్ విద్యాబోధన పట్ల కూడా 27% మంది తల్లిదండ్రులు సానుకూలత వ్యక్తపరిచారు. పాఠశాలల్లో తమ పిల్లలకు, సిబ్బందికి ఉచితంగా మానసిక ఆరోగ్య సేవలను అందించాలని ప్రపంచవ్యాప్తంగా 92% మంది తల్లిదండ్రులు భావించారు. ప్రాథమిక విద్యా దశలోనే ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తే బాగుంటుందని 53% మంది తల్లిదండ్రులు అనుకుంటున్నారని సర్వే తెలిపింది. తమ పిల్లల మానసిక ఆరోగ్య సంబంధ విషయాల గురించి ఉపాధ్యాయులు తమతో చర్చిస్తుంటారని 26% మంది తెలిపారు. కొత్త కొత్త యంత్రాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరిస్తున్న ఆధునిక సమాజం, అదే స్థాయిలో మనుషులకు సవాల్ విసురుతున్నాయి. సెల్ ఫోన్ చెరలో నేడు పిల్లలు విలువైన సమయాన్ని దుర్వినియోగం చేసుకోవడం బాధ కలిగించే విషయం. చేతిలో పాఠ్యపుస్తకం ఉండాల్సిందిపోయి సెల్‌ఫోన్ చేరింది. జనాభాలో ఎనభై శాతం పైగా దీనిని వాడుతున్నారు. తరగతి గదిలో గురువు చెప్పే అంశాలపై శ్రద్ధ పెట్టాల్సిన విద్యార్థులు ఏకాగ్రత కోల్పోయి నిత్యం సెల్ ఫోన్‌పై దృష్టి పెట్టి విలువైన సమయం వృథా చేస్తున్నారనేది పరిశోధకుల అభిప్రాయం. సెల్‌ఫోన్ విద్యార్థులపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతున్నదని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ హెచ్చరించింది. దీనివల్ల దృష్టి మందగించడం, ఆందోళన కలగటం, నిద్రాభంగం, అనైతిక కార్యకలాపాలు తద్వారా ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొంది. అంతేకాక 'నోమోపోభియా' అనే మానసిక వ్యాధికి గురవుతున్నారని వైద్యులు సూచించటం ఆలోచించాల్సిన విషయం. మనిషి జీవితంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించే 'టీనేజ్' దశ లో పిల్లలకు సరైన మార్గదర్శకత్వం ఉండాలి. శారీరక, మానసిక మార్పులను పసిగట్టాలి. లోపాలు, అసహజమైన పద్ధతుల్లో వారి ప్రవర్తన ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే సక్రమ మార్గంలో నడిచేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. క్రియాశీలక భవిష్యత్తుకు ఆటంకం కల్పించే సెల్‌ఫోన్ పట్ల జాగరూకత లేకపోతే భవిష్యత్తుకు విఘాతం కలిగే అవకాశముంటుందని గుర్తించాలి.

# ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ నుంచి గార్లపాటి నవీన్ కు అవార్డు




**హైదరాబాద్, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నుంచి పాజిటివ్ జోన్ చైర్పర్సన్ అవార్డు గార్లపాటి నవీన్ కుమార్ అందుకున్నారు. వాసవి క్లబ్ జోన్ 1 గుర్తించి, వీ 102 ఏ రీజియన్ వన్ ఇంటర్నేషనల్ నుంచి ఈ అవార్డును క్యాబినెట్ సెక్రటరీ వాడకట్టు విజయకుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏం సాని శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, ఉప్పల శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్షుడు వెంకటరమణ, సెక్రటరీ కల్వమాణిక్యం, రీజన్ చైర్పర్సన్ బాల రాజేష్ పాల్గొన్నారు. అవార్డు అందుకున్నందుకు గార్లపాటి నవీన్ కుమార్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ అశ్విన్, గవర్నర్ మరియు జోన్ పరిధిలో ఉన్న వాసవి క్లబ్స్ కి ధన్యవాదాలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా లంబయ్యగుట్ట శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం

ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ యువ నాయకుడు వై.రవీందర్ యాదవ్







**కేశంపేట,25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)** : కేశంపేట మండలం వేములనర్వ గ్రామ పంచాయతీ పరిధిలోని లంబయ్యగుట్ట శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా, కనుల విందుగా కొనసాగింది. స్వామి వారి జాతర మహోత్సవంలో భాగంగా కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించామని దేవాలయ పండితులు తెలిపారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ యువ నాయకుడు వై రవీందర్ యాదవ్ కళ్యాణోత్సవం లో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పొందారు. ప్రతి యేటా శ్రీ వేణుగోపాల స్వామి జాతరను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతుందని, సమీప గ్రామాల భక్తులకు వేణుగోపాల స్వామి పై అమిత భక్తి ఉంటుందని, కొంగుబంగారంగా కొలుస్తారని ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ జడ్పీటీసీ నర్సింగరావు, మాజీ వైస్ ఎంపీపీ అనురాధ పర్వత్ రెడ్డి మాజీ సర్పంచులు వెంకట్ రెడ్డి, నవీన్ కుమార్, లక్ష్మీనారాయణ, జమాల్ ఖాన్, భూపాల్ రెడ్డి, చంద్రయ్య, యాదయ్య, రమేష్ యాదవ్, కటికె రమేష్, కార్తీక్ తదితరులు

# వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన ఇరుకుల రామకృష్ణకు శుభాకాంక్షలు



**హైదరాబాద్, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన ఇరుకుల రామకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజికవేత్త నీల రవీందర్ ఒక ప్రకటనలో రామకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సామాజిక కార్యక్రమాల్లో అమోఘమైన సేవలు అందించిన రామకృష్ణ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ గా ఎన్నికవడం గర్వకారణమని పేర్కొన్నారు.

# ఫ్లైట్ హ్యాండ్ బ్యాగ్ రూల్స్ మార్పు



**న్యూఢిల్లీ, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇక నుంచి ఫ్లైట్ ప్రయాణంలో హ్యాండ్బ్యాగ్ కు సంబంధించి కొన్ని రూల్స్ మార్పు చెందాయి. సివిల్ ఏవియేషన్ వివరాల ప్రకారం, విమానంలో ప్రయాణించాలనుకునే వ్యక్తికి ఇకనుంచి ఒకే బ్యాగు (7 కేజీల బరువు) వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఫస్ట్ క్లాస్ విమాన ప్రయాణికులకు పరిమితి 10 కేజీలుగా ఉంటుంది. మే 2, 2024 ముందు టికెట్ బుక్ చేసుకున్నవారికి ఈ నిబంధన వర్తించదు.

## కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా మెగా హెల్త్ క్యాంపు...





**చార్మినార్, డిసెంబర్ 25(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారతరత్న అటల్ బిహారీ శత జయంతి సందర్భంగా దారుల్షఫా మైదానంలో మరియు బర్కత్‌పురంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, డాక్టర్ గౌతమ్‌రావు, అమృతరావు, ఉమా రమేష్, ఓబీసీ వైద్య అధ్యక్షుడు వినోద్ యాదవ్ యాదవ్, మైనార్టీ నాయకుడు ఫిరాసత్ అలీ బక్రీ, చార్మినార్ నియోజకవర్గ కన్వీనర్ పవన్, సీనియర్ నాయకులు శ్రీమతి పరేఖ్, అంబారి దినేష్ ఘనంగా నిర్వహించారు. వైద్యుల బృందం ఆధ్వర్యంలో . ఈ రెండు కార్యక్రమాలలో జరిగాయి. నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గ్రేట్ ఇండియన్ లెజెండ్ వాజ్‌పేయిని కొనియాడారు.

## కుంభమేళాకు సిద్ధమవుతోన్న ప్రయాగ్రాజ్



**ప్రయాగ్రాజ్, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్రాజ్ మహా కుంభమేళాకు సిద్ధమవుతోంది. ఇప్పటికే అన్ని విభాగాలకు సంబంధించి ఏర్పాట్లను చేసినట్లు అధికారులు తెలిపారు.
2025 జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనున్న ఈ మేళాలో ప్రపంచం నలుమూలల నుంచి భారతీయులు వస్తారని వేద పండితులు చెబుతున్నారు.

## ప్రధానితో చంద్రబాబు భేటీ



**న్యూఢిల్లీ, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ ముగిసింది. సమావేశంలో అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం, మధ్యంతర బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ.15 వేల కోట్లు వేగంగా అందేలా చూడాలని ప్రధానిని చంద్రబాబు కోరారు. పోలవరం నిర్మాణం వేగంగా జరిగేలా ఆర్థిక వనరులు సమకూర్చాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఇతర ప్రాజెక్టులకు కూడా ఆర్థిక సహకారం అందించాలని, ఏపీ పర్యాటనకు రావాలని ప్రధానిని చంద్రబాబు ఆహ్వానించారు.


# జాతీయ సుపరిపాలన దినం: వాజపేయి చూపిన మార్గం

**హైదరాబాద్,డిసెంబర్ 25(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత రాజకీయ చరిత్రలో తన అమూల్యమైన ముద్ర వేసి, దేశాభివృద్ధికి మరువలేని సేవలు చేసిన మహానేత అటల్ బిహారీ వాజపేయి జన్మదినాన్ని భారత ప్రభుత్వం "జాతీయ సుపరిపాలన దినం"గా గుర్తించింది. వాజపేయి జీవితంలోని ఒడిదుడుకులు, స్ఫూర్తిదాయకమైన నాయకత్వం, మరియు దేశసేవకు ఆయన చేసిన కృషి మనకు అర్థమైన గౌరవప్రదం.

**తొలినాళ్ల నుంచి మహానేతగా ఎదుగుదల**
1924 డిసెంబర్ 25న మధ్యప్రదేశ్‌లోని గ్వాలియార్‌లో జన్మించిన వాజపేయి ఓ మధ్యతరగతి కుటుంబంలో పెరిగారు. ఆయన తండ్రి కృష్ణబిహారీ ఉపాధ్యాయుడిగా, కవిగా ప్రజల మధ్య గౌరవం పొందారు. విద్యాభ్యాసంలో ప్రతిభతో మెరిసిన అటల్, హిందీ, ఆంగ్లం, సంస్కృతం లాంటి భాషల్లో ప్రావీణ్యాన్ని సాధించారు. రాజనీతిశాస్త్రంలో ఎంఏ పూర్తి చేసిన ఆయన చిన్న వయసులోనే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ( RSS )లో చేరారు.

**రాజకీయ ప్రవేశం**
1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఆయన తొలిసారి రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారు. 1951లో జనసంఘ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, ఆ తర్వాత జాతీయ కార్యదర్శిగా ఎదిగారు. 1957లో లోక్‌సభకు తొలిసారి ఎన్నికైన ఆయన, తన గణనీయమైన వాగ్ధాటితో దేశ ప్రజల మనసు గెలుచుకున్నారు.

**జనసంఘ్ నుంచి బీజేపీకి – రాజకీయ జీవన యాత్ర**
1968లో జనసంఘ్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వాజపేయి, ఆ పార్టీని దేశవ్యాప్తంగా బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దారు. 1980లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వ్యవస్థాపక అధ్యక్షుడిగా అవతరించారు. నూతన రాజకీయ మార్గదర్శకత్వం, సంస్థాగత నైపుణ్యాలతో వాజపేయి దేశ రాజకీయాల్లో నూతన శకం ప్రారంభించారు.



**ప్రధానిగా వాజపేయి యుగం**
–1996: వాజపేయి తొలిసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసినా, ఆ పదవి 13 రోజులకు మాత్రమే పరిమితమైంది.
–1998–1999: రెండోసారి ప్రధానిగా 13 నెలల పాటు పాలించారు.
–1999–2004: మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, ఐదేళ్లపాటు దేశానికి సేవచేశారు.
ఈ కాలంలో అతని నాయకత్వంలో ఇండియా గౌరవప్రదమైన దేశంగా ఎదిగింది. కార్గిల్ యుద్ధంలో విజయం, అణు పరీక్షల విజయవంతం, అద్భుతమైన విదేశీ విధానాలు, మరియు మౌలిక సదుపాయాల పెరుగుదల వంటి ఎన్నో ప్రధాన కార్యక్రమాలు వాజపేయి కాలంలోనే చోటుచేసుకున్నాయి.
అతని ఆలోచనలు – భారత రాజకీయాల్లో మార్గదర్శకాలు
వాజపేయి ప్రసంగాలు ప్రజల హృదయాలను స్పృశించేలా ఉండేవి. రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకత్వం అందించిన వాజపేయి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ దేశానికి మార్గనిర్దేశం చేశారు. ఆయన హుందాతనం, సహనశీలత, మరియు దూరదృష్టి భారతీయ రాజకీయాల్లో నూతన శక్తిని తీసుకొచ్చాయి.

**అంతిమ గౌరవం**
2014లో వాజపేయికి భారత రత్న పురస్కారం ప్రదానం చేసి, దేశం అతని సేవలను గౌరవించింది. 2018 ఆగస్టు 16న ఆయన మరణించినా, ఆయన ఆలోచనలు, విశ్వాసాలు భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

**–జాతీయ సుపరిపాలన దినం**
వాజపేయి పుట్టిన రోజు, డిసెంబర్ 25, దేశంలో మంచి పాలనకు సంకేతంగా "జాతీయ సుపరిపాలన దినం"గా ప్రకటించబడింది. ఇది కేవలం వాజపేయి ఘనతకు కాకుండా, సమాజానికి స్ఫూర్తిని అందించే రోజుగా గుర్తించబడింది.

**–సమకాలీనతకు సందేశం**
వాజపేయి చూపిన మార్గాలు, ఆయన కృషి, మరియు ఆలోచనల శైలిని గుర్తుంచుకుంటూ, నేటి రాజకీయ నాయకులు, పాలకులు దేశాభివృద్ధి కోసం పని చేయాలని ఆశిద్దాం. "రాజకీయాలు వ్యక్తిగత ప్రయోజనాలకు పరిమితం కాకుండా, దేశం కోసం కృషి చేయడమే నిజమైన నాయకత్వం" అని వాజపేయి మాకు నేర్పించిన పాఠం."
సంపాదకీయం – జి. రామకృష్ణారెడ్డి – (సీనియర్ జర్నలిస్ట్)

# గొప్ప రాజ నీతిజ్ఞుడు అటల్ బిహారి వాజ్ పేయి

- –విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతిరూపం అటల్ బిహారి వాజ్ పేయి
- –భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దడంలో వాజ్ పేయి పాత్ర చాలా గొప్పది
- –బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి
- –దేశ ప్రజలకు సూపరిపాలను అందించిన నాయకుడు అటల్ బిహారి వాజ్ పేయి
- –బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య
- –అటల్ బిహారి వాజ్ పేయి 100వ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణి చెసిన బీజేపీ నాయకులు



**షాద్ నగర్,25 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గొప్ప రాజ నీతిజ్ఞుడు, దార్శనికుడు, రచయిత, కవి, భరతమాత ముద్దుబిడ్డ భారత మాజీ ప్రధాని, భారత రత్న శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి 100వ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణం ముఖ్య కూడలి లో బీజేపీ పట్టణ అధ్యక్షులు హరి భూషణ్ అధ్యక్షణ ఆ మహనీయుని చిత్ర పటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి లు పూల మాలతో ఘనంగా నివాళులు అర్పించారు. వారితో పాటు దేపల్లి అశోక్ గౌడ్,చెంది మహేందర్ రెడ్డి,శేరి విష్ణువర్ధన్ రెడ్డి,వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అటల్ బిహారి వాజ్ పేయి దేశం కోసం తన జీవితాన్ని త్యజించిన ధృవతార యుగపురుషుడని అన్నారు. అదేవిదంగా గొప్ప రాజ నీతిజ్ఞుడని కొనియాడారు. ఎన్నో ఆటంకాలు ఎదురైనా జనసంఘ్ నుండి కూడా వాజ్ పేయి క్రమ శిక్షణ నిబద్ధతతో సిద్ధాంతం కోసం నిలబడి, ఈ సిద్ధాంతం కోసం పని చేస్తూ, ఎప్పటికైనా ఈ సిద్ధాంతమే విజయం సాధిస్తుందని నమ్మకంతో పోరాటం చేసినటువంటి పటిమ గల నాయకుడు వాజ్ పేయి అని అన్నారు. భారతదేశ రాజకీయాలలో అంటరాని పార్టీ గా భారతీయ జనతా పార్టీ ని చూసిన సందర్భంలో దేశంలో సంకీర్ణ యుగానికి సుస్థిరపాలన అందించవచ్చని వారి నేతృత్వంలో అనేక మంది పార్టీల యొక్క కలయిక తో ఒక సుస్థిర ప్రభుత్వాన్ని అందించిన గొప్ప నాయకుడు వాజ్ పేయి ని అన్నారు. దేశంలో 2 ఎంపీ ల నుండి ప్రారంభమై నేడు దేశంలో అతి పెద్ద రాజకీయ పార్టీ గా బీజేపీ విస్తరించిందంటే ఆనాడు వాజ్ పేయి వేసిన మార్గమే ముఖ్య కారణమని అన్నారు. ప్రపంచంలో భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దడం లో వాజ్ పేయి గారు కీలక పాత్ర పోషించిరని, నేటి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ వాజ్ పేయి ఆశయాలను అనుసరిస్తూ దేశ ప్రజలకు సుపరి పాలనను అందిస్తున్నారని అన్నారు. దేశ అభివృద్ధి కోసం నేటి యువతరం అటల్ బిహారి వాజ్ పేయి ఆశయాలను అనుసరిస్తూ సిద్ధాంతం కోసం పాటు పడాలని,2047 నాటికి వికసిత్ భారత్ లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా అందే బాబయ్య మాట్లాడుతూ మాజీ ప్రధాని భారత రత్న అటల్ బిహారి వాజ్ పేయి గారు దేశ ప్రజలకు సుపరిపాలను అందిస్తూ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. దేశ అభివృద్ధి లో అయన వేసిన మార్గంలో నేటి యువతరం నడుచుకోవాలని,అభివృద్ధి చెందిన భారత్ లో అందరూ కీలక పాత్ర పోషించాలని అన్నారు.
అనంతరం అటల్ బిహారి వాజ్ పేయి 100వ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో పండ్లు,బ్రెడ్ పంపిణి చేసారు.
ఈ కార్యక్రమంలో మల్చలం రాము,బాల్ రెడ్డి ,గజ్జల ప్రవీణ్,జె నర్సింహా ,మోహన్ సింగ్ ,కుడుముల బాలరాజు ,కాసోజు శివ, సుధాకరప్ప, రవి నాయక్ ,గుంత సత్యం, శ్యామ్ సుందర్ ,మహేష్ ,గట్టొజు విజయ్ ,నరేందర్ రెడ్డి,భాను ప్రసాద్ ,తదితరులు నేతలు పాల్గొన్నారు.

# యుద్ధాలు వద్దు..శాంతే ముద్దు

## – పోప్ ఫ్రాన్సిస్ క్రిస్మస్ సందేశం

**వాటికన్(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ బుధవారం ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చారు. వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికా బాల్కనీ నుంచి వేలాది మంది ప్రజలకు ఆయన సంప్రదాయ సందేశాన్ని అందిస్తూ రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రస్తావించారు. మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధానికి స్వస్తి చెప్పేందుకు రెండు దేశాలు చర్చలు జరపాలని పిలుపునిచ్చారు. 'యుద్ధం కారణంగా అతలాకుతలమవుతున్న ఉక్రెయిన్‌లో ఆయుధ శబ్దాలు ఆగిపోవాలి. న్యాయసమ్మతమైన, చిరకాల శాంతి కోసం రెండు దేశాలు సంప్రదింపులు జరపాలి' అని ఆకాంక్షించారు. క్రిస్టమస్ రోజున



ఉక్రెయిన్‌పై రష్యా దాడులు జరిపిన నేపథ్యంలో పోప్ ఇచ్చిన సందేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉక్రెయిన్ ఇంధన గ్రిడ్‌ను లక్ష్యంగా చేసుకొని రష్యా జరిపిన దాడిలో అనేక మంది గాయపడ్డారు. లెబనాన్, మాలీ, మొజాంబిక్, హైతీ, వెనిజులియా, నికరాగ్వువా సహా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న రాజకీయ, సామాజిక, సైనిక ఘర్షణలకు స్వస్తి చెప్పాలని 88 సంవత్సరాల పోప్ ఫ్రాన్సిస్ ఉద్బోధించారు. యుద్ధాల గురించి, పాఠశాలలు, ఆస్పత్రులపై జరుగుతున్న బాంబు దాడులను గురించి ఆలోచించాలని ఆయన ఈ సందర్భంగా క్రైస్తవులను కోరారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న సైనిక దాడులను పోప్ ఇటీవల తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయిల్ చర్యను క్రూరత్వంగా ఆయన గత వారం అభివర్ణించారు. హమాస్ చేతిలో బందీలుగా ఉన్న మిగిలిన ఇజ్రాయిలీలను విడుదల చేయడం కోసం ఇజ్రాయిల్–హమాస్‌లు కాల్పుల విరమణ పాటించాలని కోరారు. గాజాలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అంటూ చర్చలు, శాంతి స్థాపనకు మార్గం సుగమం చేయాలని పోప్ సూచించారు.

# యువతను కాపాడేందుకు ఐక్యంగా ముందుకు రావాలి

**-డ్రగ్స్ మాఫియాపై డ్రగ్స్ వ్యతిరేక దండయాత్ర అవసరం: సామాజిక కార్యకర్త నరేష్ దండు**



**హైదరాబాద్, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ రాష్ట్రంలో మాదకద్రవ్యాల మాఫియా భూతంలా విస్తరిస్తోందని సామాజిక కార్యకర్త నరేష్ దండు అన్నారు. పట్నం నుంచి పల్లె దాకా విస్తరించిన ఈ మాఫియా యువతను గాడి తప్పిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల నుంచి ఉద్యోగస్తుల వరకు డ్రగ్స్ బానిసలుగా మారుతున్నారని, కొత్త సంవత్సరం వేడుకలతో మరింత తీవ్రమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారని చెప్పారు.

**డ్రగ్స్ వల్ల సమాజానికి తీవ్ర నష్టాలు**

ఆరోగ్య సమస్యలు: డ్రగ్స్ వాడకంతో శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. నాడీ వ్యవస్థ దెబ్బతిని, వ్యక్తి మానసిక వికలాంగుడిగా మారే ప్రమాదం ఉంది. హెచ్ఐవి, హెపటైటిస్ వంటి తీవ్ర వ్యాధులు డ్రగ్స్ వాడకంతో వ్యాపిస్తున్నాయని తెలిపారు.

**కుటుంబాల పతనం:**

డ్రగ్స్ బానిసలుగా మారిన వ్యక్తులు తమ కుటుంబాలకు భారంగా మారుతున్నారని, ఆర్థిక ఇబ్బందులు, సంబంధాల విరుగుడు, ఇంటి స్థాయి గొడవలు పెరుగుతున్నాయని చెప్పారు.

**నేరస్థుల సంఖ్యలో పెరుగుదల:**

డ్రగ్స్ బానిసలు దొంగతనాలు, దోపిడీలు చేయడానికి పాల్పడుతున్నారని, ఇది సమాజ భద్రతకు పెద్ద ప్రమాదంగా మారిందని నరేష్ దండు పేర్కొన్నారు.

**సమాజంలో అభివృద్ధి క్షీణత:**

డ్రగ్స్ మాఫియా సమాజంలో యువత శక్తిని తుడిచివేస్తోందని, దేశ భవిష్యత్తు యువతలో ఉందనే నమ్మకాన్ని ధ్వంసం చేస్తోందని వివరించారు.

**ఆర్థిక నష్టం:**

డ్రగ్స్ వ్యసనంతో బాధపడుతున్న వ్యక్తులు తమ ఆరోగ్యం కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని, ఉద్యోగాలపై శ్రద్ధ చూపక, ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు.

**నైతిక విలువల క్షీణత:**

డ్రగ్స్ వాడకంతో వ్యక్తుల నైతికత మరియు వ్యక్తిత్వం పతనం చెందుతుందని, కుటుంబాలను రక్షించాల్సిన వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన యువత చీకటిలో నెట్టబడుతున్నారని తెలిపారు.

**ప్రభుత్వ చర్యలు మాటల్లోనే మిగిలిపోతున్నాయా?**

నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో –, రాష్ట్ర పోలీసులు



డ్రగ్స్ ముఠాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, సరఫరా ఆగడం లేదని అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ, జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట వంటి ప్రాంతాలు డ్రగ్స్ వ్యాపారానికి కేంద్రాలుగా మారాయని నరేష్ దండు వెల్లడించారు.

**సమాజానికి పిలుప – ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి**

డ్రగ్స్ వ్యాపారాన్ని అరికట్టడానికి ప్రభుత్వం, సమాజం కలిసి పనిచేయాలని, డ్రగ్స్ విక్రయాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, యువతకు డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలని, స్కూళ్లు, కాలేజీల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు కలిసి కార్యాచరణలో నడపాలి

కొత్త సంవత్సర వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో, మాదకద్రవ్యాల సరఫరాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ సమయంలో డ్రగ్స్ వ్యాపారం మరింత పెరిగే అవకాశం ఉందని, ఈ వేడుకల సమయంలో సమాజంలో యువతను నిరోధించే చర్యలను మరింత సమర్థంగా అమలు చేయాలని నరేష్ దండు పేర్కొన్నారు.

**సమాజానికి సందేశం:**

"డ్రగ్స్ వ్యాపారంపై నిద్రలేని పోరాటం, యువతకు మేలైన భవిష్యత్తు చూపే చట్టాలే ఈ సమస్యకు పరిష్కారం. యువతను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి."

ప్రభుత్వం, సమాజం కలిసి పనిచేస్తేనే ఈ భూతాన్ని తరిమికొట్టగలుగుతామన్నారు. అందరం చైతన్యవంతులమై, యువతను కాపాడుకుందామని నరేష్ దండు పిలుపునిచ్చారు.

# ఎలా బయటపడదాం?

**– అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలపై పక్షాల భేటీలో చర్చ**
**– ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలి : ఎన్డీఏ పక్షాలకు అమిత్ షా నిర్దేశం**

**న్యూఢిల్లీ**

అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఈ అంశం నుంచి ఎలా బయటపడదామని ఎన్డీఏ పక్షాలు సమాలోచన చేశాయి. సమావేశంలో బీహార్‌లోని జేడీయూ, హెచ్ఏఎం వంటి పార్టీలు అమిత్ షాను బహిరంగంగా ప్రశ్నించకపోయినా, లోలోపల మాత్రం విముఖత వ్యక్తం చేశాయి. అయితే ఈ అంశంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని ఎన్డీఏ పక్షాలను అమిత్ షా నిర్దేశించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా బుధవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఎన్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, టీడీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జేడీయూ నేత, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, అప్నాదళ్ అధ్యక్షురాలు, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్, జేడీఎస్ నేత, కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి, హిందుస్థానీ అవామ్ మోర్చా (ఎస్) నాయకుడు జితన్ రామ్ మాంఝీ, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహా, భరత్ ధర్మ జనసేన అధ్యక్షుడు



తుషార్ వెల్లపల్లి తదితరులు పాల్గొన్నారు. రాజకీయ వ్యూహాల చుట్టూ చర్చలు జరిగినట్టు తెలుస్తోంది. ఎన్డీఏలో సమన్వయాన్ని బలోపేతం చేయడంపై కూడా చర్చలు జరిగాయి. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్, ఇతర పార్టీలు చేస్తున్న ఆందోళన నుంచి బయటపడాలని, ప్రభుత్వ సానుకూల విధానాలు, చొరవలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని ఎన్డీఏ నాయకులకు అమిత్ షా సూచించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు ఉభయ సభలలో రాజ్యాంగ దినోత్సవం రోజున జరిగిన నిర్మాణాత్మక చర్చల ప్రాముఖ్యతను ఈ సమావేశం నొక్కిచెప్పింది. వాజ్‌పేయి జయంతి సందర్భంగా భవిష్యత్ సమావేశాలను ఏర్పాటు చేయడంతో ఆయన వారసత్వాన్ని స్మరించుకోవాలని కూటమి నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రాష్ట్రంలో ఏ విధంగా ముందుకు తీసుకుని వెళ్ళాలనే అంశాలపై చర్చించినట్టు సమాచారం. ఈ సమావేశంలో వన్ నేషన్ %-% వన్ ఎలక్షన్, వక్ఫ్ బోర్డ్ అంశాలు చర్చకు రాలేదని నేతలు పేర్కొన్నారు.

# నేడు ఇందిరాపార్కు వద్ద టీపీటీఎఫ్ ధర్నా

**హైదరాబాద్, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నేడు మధ్యాహ్నం ఒకటి గంటల నుండి నాలుగు గంటల వరకు ఇందిరాపార్కు వద్ద సమగ్ర శిక్ష, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ ఉద్యోగాలు, ఉపాధ్యాయులు మరియు గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల సిఆర్టి ల సమస్యల పరిష్కారానికి టీపిటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా టీచర్లు, ఎస్ఎస్ఈ ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయులు, సిఆర్‌టీలు హాజరవుతున్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు.

# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఇండో-ఇజ్రాయిల్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్





**రంగారెడ్డి, డిసెంబరు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హ్యాపీ క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఇండో ఇజ్రాయిల్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్ వారికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన యాదం రాజు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కె వి ఎన్ రెడ్డి, వెంకట్ రెడ్డి. ఈ సందర్భంగా కేవీయన్ రెడ్డి మాట్లాడుతూ, "క్రిస్మస్ పండుగ సందర్భముగా ఈ వినోదాలు, ప్రార్థనలు, ప్రత్యేక విందులు పండుగ వేడుకల్లో భాగంగా నిర్వహించడం సంతోషకరం. క్రిస్మస్ అంటే ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది జరుపుకునే సాంస్కృతిక పండుగ. బైబిల్ ప్రకారం, దేవుడు భూమి పైకి వచ్చాడు, మానవజాతి పాపాలను కడగడానికి వచ్చినారని ప్రజల నమ్మకం. అందుకే క్రిస్మస్ పండుగ ఘనంగా జరుపుకుంటారు," అన్నారు. ప్రజలందరూ సోదర భావంతో మెలగాలి," అని కేవీయన్ రెడ్డి అన్నారు.ద

# పార్లమెంట్ సాక్షిగా.. నిప్పంటించుకుని ఆత్మాహత్యాయత్నం

**-95 శాతం గాయాలతో విషమ పరిస్థితి**



**న్యూఢిల్లీ(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఏం కష్టమెచ్చిందో ఏమో.. ఒక వ్యక్తి ఏకంగా పార్లమెంట్ ముందే నిప్పు అంటించుకుని ఆత్యాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, రైల్వే పోలీసులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. 95 శాతం గాయాలైన అతని పరిస్థితి విషమంగా ఉందని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో పార్లమెంట్‌కు ఎదురుగా ఉండే రైల్వే భవన్ సమీపంలోని పార్క్‌లో నిప్పు అంటించుకుని పార్లమెంట్ వైపు పరుగులు తీస్తుండగా ఇతన్ని రక్షించారు. ఆస్పత్రికి తరలించారు. బాధితుడి వద్ద పాక్షికంగా కాలిపోయిన రెండు పేజీల సూసైడ్ నోట్‌ను గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌లోని భాగ్‌పట్‌కు చెందిన జితేంద్రగా బాధితుడ్ని గుర్తించారు. కుటుంబ సమస్యలతో ఈ దారుణానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. ప్రస్తుతం పార్లమంట్ సమావేశాలు జరగడం లేదు. శీతాకాల సమావేశాలు ఈ నెల 20తో ముగిసాయి.

# ఆడపిల్లలకు స్కూటీలు ఎక్కడున్నాయి

**– బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత**



**(నీలగిరి ఎక్స్ ప్రెస్)–మెదక్**

కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలను నమ్మించి మోసం చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మెదక్ చర్చి వంద సంవత్సరాల ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ప్రకటిస్తారని, కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటన చేస్తారని ప్రజలు ఆశించారన్నారు. కానీ రేవంత్ రెడ్డి అలాంటి ఆలోచన చేయడం లేదని వ్యాఖ్యానించారు. మహాలక్ష్మీ పథకం కింద నెలకు రూ. 2500 చెల్లించకపోవడంతో ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇప్పటికీ రూ. 30 వేలు బాకీ పడిందని వివరించారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు ఎక్కడున్నాయని అడిగారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, యాదవరెడ్డి, నేతలు మేడే రాజీవ్ సాగర్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూ.26,999కే ఐఫోన్ 15.. ఫ్లిప్‌కార్ట్ బంపర్ ఆఫర్..!

ఐఫోన్ ఈ పేరు గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. గ్లోబల్ టెక్ దిగ్గజం ఆపిల్ సంస్థకు చెందిన ఐఫోన్లను కొనుగోలు చేయాలని ప్రతి ఒక్కరూ కలలు కంటుంటారు. అయితే, ఆ కలలు అందరికీ నెరవేరవు. అందుకు కారణం సాధారణ ఫోన్లతో పోలిస్తే ఐఫోన్ ధరలు చాలా ఎక్కువగా ఉండడమే. దీంతో కొందరు బెస్ట్ డిస్కౌంట్స్ కోసం ఎదురుచూసి వాటిని సొంతం చేసుకుంటుంటారు. అలాంటి వారికి ఓ గుడ్ న్యూస్. గతేడాది మార్కెట్‌లోకి వచ్చిన ఐఫోన్ 15 పై ప్రముఖ ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఊహించని డీల్‌ను ప్రకటించింది. రూ.69,990 విలువైన ఈ ఫోన్‌ను రూ.27వేలకే అందిస్తోంది.సాధారణంగా 15 128+ ధర రూ.69,990. ఈ ప్రీమియం డివైజ్ ఇప్పుడు పలు డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లను కలుపుకుని కేవలం రూ. 26,999కే ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంది. ఎక్స్ఛేంజ్‌లో గరిష్ఠంగా రూ.31,500 వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని ఫ్లిప్‌కార్ట్ కల్పించింది. అందుకోసం మనం ఐఫోన్ 14ను ఎక్స్ఛేంజ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా చేస్తే



ఈ స్మార్ట్‌ఫోన్‌ను రూ. 26,999కే మీ సొంతం చేసుకోవచ్చు. ఎక్స్ఛేంజ్ ఆఫర్ మినహాయింపుతో అయితే గరిష్ఠంగా 16 శాతం తగ్గింపుతో రూ.58,499కు ఫోన్ లభిస్తోంది. అంతేకాదండోయ్.. దీనిపై ఫ్లిప్‌కార్ట్ 'మినిట్స్' డెలివరీ సేవను కూడా అందిస్తోంది. ఎంపిక చేసిన ప్రదేశాల్లో కేవలం 14 నిమిషాల్లోనే ఈ ఫోన్‌ను డెలివరీ చేయనున్నట్లు వెల్లడించింది. అయితే ఇందుకోసం అదనపు ఛార్జీలు వర్తిస్తాయి. ఈ ఆఫర్ డిసెంబర్ 20 నుంచి 25 వరకు మాత్రమే అందుబాటులో ఉంది. నేటితో ఈ ఆఫర్ ముగియనుంది. ఐఫోన్ 15 గతేడాది (2023) సెప్టెంబర్‌లోలో విడుదలైన విషయం తెలిసిందే. బ్లాక్, బ్లూ, గ్రీన్, పింక్, ఎల్లో రంగుల్లో లభిస్తుందీ ఫోన్. ఐఓఎస్ 17 వర్షన్‌పై పని చేస్తున్న ఐ-ఫోన్ 15 ఫోన్.. ఆపిల్ ఏ16 బయోనిక్ చిప్ కలిగి ఉంటుంది. 6.1 అంగుళాల సూపర్ రెటీనా ఎక్స్‌డీఆర్ ఓలెడ్ స్క్రీన్, డైనమిక్ ఐలాండ్ వంటి ఫీచర్లు ఉంటాయి.

## బిజినెస్

### రుగుతున్న డిజిటల్ చెల్లింపుల ట్రెండ్.. 33శాతం పెరిగిన యూపీఐ క్యూఆర్ లావాదేవీలు..!




ఈ ఏడాది సెమీ అర్బన్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని రిటైల్ షాపుల్లో యూపీఐ క్యూఆర్ లావాదేవీలు 33శాతం పెరిగాయి. దేశంలో డిజిటల్ చెల్లింపుల ట్రెండ్ పెరుగుతుందనడానికి ఇదే నిదర్శనమని పేనియర్‌బై విడుదల చేసిన నివేదిక చెబుతున్నది. వ్యాపార రుణాలు, వ్యక్తిగత బంగారం రుణాలు, ఈ ప్రాంతాల్లో సులభ నిబంధనలపై రివాల్వింగ్ ఇచ్చిన రుణాలతో సహా రుణ ఉత్పత్తుల్లో 297శాతం పెరుగుదల నమోదైంది. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఆర్థిక, డిజిటల్ సేవలు అందిస్తున్న 10లక్షల కంటే ఎక్కువ చిన్న రిటైలర్ల నుంచి సేకరించిన వాస్తవ లావాదేవీల డేటా ఆధారంగా నివేదికను రూపొందించింది.నివేదిక ప్రకారం.. బీమా పాలసీ కొనుగోలు, ప్రీమియం సేకరణ కోసం యూపీఐ క్యూర్ లావాదేవీల సంఖ్య ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు 127 శాతం పెరిగింది. అలాగే, కొత్తగా 96శాతం వినియోగదారులు పెరిగారు. పేనియర్ బై ఎండీ-సీఈవో ఆనంద్ కుమార్ బజాజ్ మాట్లాడుతూ బీమా, ఈ కామర్స్, రుణాలు తదితర సేవలు అందించేందుకు అవసరమైన సాధనాలను అందించడం ద్వారా స్థానిక రిటైలర్లకు సాధికారత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మైక్రో ఏటీఎంలు, ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ నుంచి నగదు ఉపసంహరణలు ఈ ఏడాది తగ్గుముఖం పట్టాయి. అలాగే, పీఎం కిసాన్ వంటి పథకాల కింద నగదుల బదిలీ సమయంలో ఏఈపీఎస్ ద్వారా నగదు ఉపసంహరణలు 35-45శాతం పెరిగాయి. జమ్మూ కాశ్మీర్‌లో నగదు విత్‌డ్రాలు 74 శాతం పెరిగాయి.

## ఐసీయూలో రూపీ..! ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరిక

-డాలర్ దెబ్బకు రోజుకింత పడిపోతున్న మారకపు విలువ
-మరో 4 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 85.15కు చేరిక

డాలర్ దెబ్బకు రూపాయి ఏమాత్రం నిలబడలేకపోతున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా కరెన్సీతో పోల్చితే భారతీయ కరెన్సీ మారకం విలువ మళ్లీ ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది మరి. మంగళవారం మరో 4 పైసలు పడిపోవడంతో మునుపెన్నడూ లేనివిధంగా 85.15 వద్దకు చేరింది. దీంతో ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో గత 4 రోజులుగా రూపీ 85పైనే ఉంటున్నట్టైంది. గత



గురువారం తొలిసారి 85 మార్కును దాటిన విషయం తెలిసిందే. సోమవారం కూడా 7 పైసలు నష్టపోగా.. ఈ రెండు రోజుల్లో 11 పైసలు కోల్పోయింది.

**పతనం వెనుక..**

డిసెంబర్ నెల ముగుస్తుండటంతో దేశీయ మార్కెట్‌లోని దిగుమతిదారులపై చెల్లింపుల ఒత్తిడి ఉంటుందని, ఈ క్రమంలోనే డాలర్లకు పెరుగుతున్న డిమాండ్.. రూపీని మరింత బలహీనపరుస్తున్నదని ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. పైగా జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రాబోతున్నారు. దీంతో మళ్లీ సుంకాల సమరం మొదలవుతుందన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఫలితంగా డాలర్ల కోసం భారతీయ దిగుమతిదారులు ఎగబడిపోతున్నారు.

## ఈ ఏడాది అత్యధిక ట్యాక్స్ పే చేసిన క్రికెటర్ ఎవరో తెలుసా..?

ప్రపంచ వ్యాప్తంగా ఈ ఆటకు ఉన్న క్రేజ్ మరే ఇతక క్రీడకూ లేదనడంలో ఎలాంటి సందేహం లేదు. క్రికెటర్లను అభిమానులు దేవుళ్లలా పూజిస్తుంటారు. వాళ్లకున్న ఫ్యాన్ ఫాలోయింగ్ సినీ తారలకు కూడా ఉండదు. క్రికెటర్లు కూడా ఈ ఆట ద్వారా బాగానే సంపాదిస్తుంటారు. తమ ఆటతీరుతోపాటు ఇతర మార్గాల ద్వారా రూ.కోట్లు అర్జిస్తుంటారు. అందుకు తగ్గట్టుగానే ఆదాయపన్ను కూడా కడుతుంటారు. ఇలా ఈ ఏడాది అత్యధికంగా ట్యాక్స్ పే చేసిన క్రికెటర్ ఎవరో మీకు తెలుసా..? ఎవరో కాదండీ మన విరాట్ కోహ్లినే. ఈ ఏడాది ఆయన ఏకంగా రూ.కోట్ల రూపాయలను ఆదాయపన్ను శాఖకు కట్టారు.రన్ మెషీన్‌గా పేరుగాంచిన విరాట్ కోహ్లీ గురించి తెలియని వారు ఉండరు. తన ఆటతీరుతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానుల్ని సొంతం చేసుకున్నాడు. టీమిండియా లో టాప్ బ్యాటర్ అంటే అందరికీ ముందుగా గుర్తొచ్చేది కింగ్ కోహ్లినే. కేవలం ఆట పరంగానే కాదు సంపాదనలోనూ అతను కింగే. క్రికెట్



ద్వారానే కాకుండా యాడ్స్, ఇతర బిజినెస్‌ల ద్వారా కోహ్లీ రూ.వందల కోట్లు సంపాదిస్తున్నాడు. అయితే, సంపాదనకు తగ్గట్టు ట్యాక్స్ పే చేస్తున్న క్రికెటర్లలోనూ కోహ్లీ ఫస్ట్‌ప్లేస్‌లో ఉన్నాడు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా పన్ను చెల్లించిన క్రికెటర్‌లలో విరాట్ కోహ్లీ తొలి స్థానంలో నిలిచాడు. కోహ్లీ ఏకంగా రూ.66 కోట్ల పన్ను చెల్లించాడు. ట్యాక్స్ రేట్ల ప్రకారం చూస్తే ఆయన ఆదాయం ఆ ఒక్క ఏడాదిలో ఏకంగా రూ.200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇక కోహ్లీ తర్వాత మాజీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ రూ.38 కోట్లతో రెండో స్థానంలో నిలిచారు. సచిన్ టెండూల్కర్ రూ.28 కోట్లు, సౌరభ్ గంగూలీ రూ.23 కోట్లు, భారత జట్టు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య రూ.13 కోట్లు, రిషభ్ పంత్ రూ.10 కోట్లు, అజింక్య రహానే రూ.8 కోట్లు, బుమ్రా రూ.7 కోట్లు, శిఖర్ ధావన్ రూ.6 కోట్లు, కేఎల్ రాహుల్ రూ.5 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు.

## బాక్సింగ్ డే టెస్టులో ఓపెనర్‌గా రోహిత్ శర్మ..!


భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ మెల్‌బోర్న్‌లో జరిగిన బాక్సింగ్ డే టెస్టులో ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో.. రెండు, మూడవ టెస్టుల్లో అతను లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసిన విషయం తెలిసిందే. మెల్‌బోర్న్ టెస్టులో కేఎల్ రాహుల్ మూడవ నెంబర్‌లో బ్యాటింగ్ చేసే ఛాన్సు ఉన్నట్లు ఓ మీడియా రిపోర్టు ద్వారా తెలిసింది. కానీ శుభమన్ గిల్‌కు చెందిన బ్యాటింగ్ ఆర్డర్‌పై ఎటువంటి ప్రకటన ఇంకా రాలేదు. ఈ మ్యాచ్‌కు ఇద్దరు స్పిన్నర్లను దించాలని ఇండియా భావిస్తున్నది. రవీంద్ర జడేజాతో పాటు వాషింగ్టన్ సుందర్ కూడా ఆడే అవకాశం ఉన్నది. ఒకవేళ సుందర్ ప్లేస్ కన్ఫర్మ్ అయితే, అప్పుడు నితీశ్ రెడ్డికి మొండి చెయ్యి




చూపాల్సి వస్తుంది.మరో వైపు ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ అరుదైన రికార్డుకు దగ్గరలో ఉన్నారు. మరో అయిదు వికెట్లు తీస్తే, అతను అంతర్జాతీయ క్రికెట్‌లో ఏడు వందల వికెట్లు తీసిన ఆసీస్ బౌలర్ల జాబితాలో చేరుతాడు. షేన్ వార్న్ 1001, గ్లెన్ మెక్‌గ్రాగ్ 949, బ్రెట్ లీ 718 వికెట్లు తీసుకున్నారు. 284 అంతర్జాతీయ మ్యాచుల్లో స్టార్క్ మొత్తం 695 వికెట్లు తీసుకున్నాడు

## స్పోర్ట్స్

### భారత్-ఆస్ట్రేలియా నాలుగో టెస్ట్.. మెల్‌బోర్న్ గ్రౌండ్ పిచ్ రిపోర్ట్ ఇదే..!



బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లో భాగంగా గురువారం నుంచి ఆస్ట్రేలియా, భారత్ మధ్య నాలుగో టెస్ట్ మొదలవనున్నది. మెల్నబోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే మ్యాచ్‌లో నెగ్గి.. సిరీస్‌లో పైచేయి సాధించాలని ఇరుజట్లు భావిస్తున్నాయి. ఐదు టెస్టుల సిరీస్‌లో ఇప్పటికే ఇరుజట్లు చెరో మ్యాచ్‌లో నెగ్గగా.. మరో టెస్ట్ డ్రాగా ముగిసింది. పెర్త్ టెస్ట్‌లో భారీ విజయం సాధించిన టీమిండియా అడిలైడ్‌లో జరిగిన టెస్ట్‌లో బోల్తాపడింది. వర్షం కారణంగా గబ్బా టెస్ట్ డ్రాగా ముగియడంతో తృటిలో ఓటమి నుంచి బయపడింది. ఎంసీజీలో జరిగిన చివరి మూడు టెస్టుల్లో భారత్ రెండుసార్లు గెలువగా.. మరో మ్యాచ్‌ను డ్రాగా చేసుకుంది. అచ్చొచ్చిన ఎంసీజీలో వరుసగా నాలుగో సారి ఆతిథ్య జట్టును మట్టికరిపించాలని టీమిండియా భావిస్తున్నారు. నాలుగో టెస్ట్‌కు మెల్‌బోర్న్ గ్రౌండ్ పిచ్ విషయానికి వస్తే.. పిచ్‌పై గడ్డి బాగానే ఉంది. కొత్త బంతితో బౌలర్లు చూపే అవకాశం ఉంటుంది. అదనపు బౌన్స్‌తో పాటు సీమ్‌ను రాబట్టొచ్చు. బ్యాటర్లు కుదురుకుంటే మాత్రం భారీగా పరుగులు తీయొచ్చు. టాస్ కీలకంగా మారే అవకాశం ఉంటుందని క్రికెట్ పండితులు పేర్కొంటున్నారు. ఎంసీజీ టెస్టుల్లో సగటు మొదటి ఇన్నింగ్స్ స్కోరు 307. తొలుత బ్యాటింగ్ చేసిన జట్లు ఇప్పటి వరకు 117 మ్యాచుల్లో 57 సార్లు గెలిచాయి. టీమిండియా మిస్టరీ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ఎంసీజీలో మంచి రికార్డు ఉన్నది. ఇక్కడ ఆడిన రెండుటెస్టుల్లో 15 వికెట్లు పడగొట్టాడు